క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


రెడ్డినాయక్

ఖానాపురం : మండలంలోని వేపచెట్టు తండాలో గ్రామ బీఆర్ఎస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం మాజీ సర్పంచ్ భూక్య పద్మ,వెంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేజావత్ రెడ్డి నాయక్, గౌరవ అధ్యక్షుడిగా బిచ్చ నాయక్, భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్, ప్రధాన కార్యదర్శిగా మూడు రమేష్, ఉపాధ్యక్షులుగా హేమ, లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా శంకర్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్సై మొబైల్‌ఫోన్ హ్యాక్

నల్లబెల్లి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గోవర్ధన్ మొబైల్ ఫోన్ సోమవారం రాత్రి హ్యాక్ అయింది. ఎస్సై వాడుతున్న స్మార్ట్‌ఫోన్ నుంచి ఇతరుల స్మార్ట్ ఫోన్లకు వరుసగా అనుమానాస్పద మెసేజ్‌లు, లింక్‌లు కనిపించడంతో ఎస్సై అప్రమత్తమై వెంటనే సైబర్ సెక్యూరిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రాథమికంగా గుర్తించిన మేరకు హ్యాకర్లు వ్యక్తిగత వివరాలు, వాట్సాప్ కాంటాక్ట్‌లు సేకరించే ప్రయత్నం చేసినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణారెడ్డి మాట్లాడుతూ తెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లు క్లిక్ చేయకూడదని, బ్యాంక్ సంబంధిత ఓటీపీలు ఎవ్వరికీ చెప్పకూడదని సూచించారు. ఏమైనా సందేహాలు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్థికసాయం



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన ఒరిగెల కావేరి బీటెక్ చదువుతుంది. ఆర్థిక భారంతో పాటు తండ్రి కూడా లేకపోవడంతో తల్లి అన్ని తానై చదివిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న మాస్ సంస్థ సభ్యులు సోమవారం కావేరికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్, అలువాల విజయకుమార్, సీనపల్లి విక్రమ్‌కుమార్, శివ శంకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఖానాపురం : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని డాక్టర్లు కల్పన, రవీందర్ సూచించారు. మండలంలోని తెలంగాణ రాష్ట్ర సైనిక్ స్కూల్‌లో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు చేసి కిషోర రక్ష కార్డులో నమోదు చేశారు. ప్రిన్సిపాల్ గట్ల సురేందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజయ్య, సిబ్బంది నవీన్, దామోదర్‌రెడ్డి, భాస్కర్, రమ్య, విజయరాణి, అన్నపూర్ణ, దివ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత




వర్ధన్నపేట : మండలంలోని చెన్నారంలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు, యువకులు అడ్డుకున్నారు. భారీ సంఖ్యలో ట్రాక్టర్లు పెద్ద శబ్దాలతో వెళ్లడం వల్ల కనీసం నిద్ర కూడా పోలేక పోతున్నామని, గ్రామంలోని రోడ్లన్ని ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి 563 పై ఇసుక అక్రమ రవాణాపై ఆంక్షలు, చెక్ పోస్టు, పోలీసుల నిఘా ఉండటంతో అక్రమార్కులు దొంగ దారిని ఎంచుకొని గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు.

జయప్రదం చేయాలి

నల్లబెల్లి : ఈ నెల 28న నిర్వహించనున్న ఆసరా పెన్షన్ దారుల మహాగర్జన యుద్ధభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సభకు సంబంధించి ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు..

● పురుగుల మందు తాగి ఆత్మహత్య


కాన్య మృతదేహం

రాయపర్తి : మద్యం తాగొద్దని మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని తెట్టెకుంట తండాలో చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. తెట్టెకుంట తండాకు చెందిన బానోత్ కాన్య (78) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి సైతం గురయ్యాడు. కుటుంబ సభ్యులతో తరుచూ గొడవలకు పాల్పడేవాడు. అయితే కాన్యను అతని భార్య మద్యం తాగడం మానివేయాలని ఒత్తిడి తీసుకురావడంతో మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాన్య కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాదన్నపేట చెరువుకు జలకళ

● తరలివస్తున్న పర్యాటకులు
● బోటింగ్ సౌకర్యం లేక అసంతృప్తి


నిండు కుండలా మాదన్నపేట చెరువు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోనే అతిపెద్ద, పురాతమైన చెరువు మాధన్నపేట చెరువు. దీని సామర్థ్యం 17 ఫీట్లు, ఈ చెరువు కింద సుమారు 3నుంచి 4వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నారు. మరో ఐదువందల ఎకరాల వరకు అనధికారికంగా సాగు చేస్తున్నారు. నర్సంపేట నుంచి నల్లబెల్లి వయా మాధన్నపేట, మరోవైపు 365 జాతీయ రహదారి నుంచి కమలాపురం మీదుగా ఈ చెరువుకు వెళ్లొచ్చు. మాధన్నపేట, నాగుర్లపల్లి, ఇటుకాలపల్లి, ముత్తోజిపేట, రాజుపేటకు చెందిన మత్స్యకారులు కలిసి సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ చెరువులోని చేపలను ప్రతి ఏటా దాదాపు 10 నుంచి 15 కంటైనర్లలో చేపలను ఎగుమతి చేస్తుంటారు. అంతేకాకుండా ఈ దారి పొడువున తాటి, ఈత చెట్లతో చూపరులను ఆకట్టుకుంటోంది. మాధన్నపేట చెరువుపై రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దాత దొడ్డ మోహన్‌రావు నిర్మించారు.

పర్యాటక రంగంగా అభివృద్ధి కరువు

మాధన్నపేట చెరువు నర్సంపేటకు కూత వేటు దూరంలోనే ఉంటుంది. చుట్టు పక్క గ్రామాలైన నాగుర్లపల్లి, మాధన్నపేట ఇటీవల నర్సంపేట మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. మరోవైపు 365 జాతీయ రహదారి అనుకొని ఉన్న కమలాపురం గ్రామాన్ని 2018 ఎన్నికల ముందే నర్సంపేట పట్టణంలో విలీనమయ్యారు. అన్ని విధాలుగా మాధన్నపేట చెరువు ఉన్నప్పటికీ పర్యాటకంగా అభివృద్ధి నోచుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలోనే మాధన్నపేట చెరువు మినీట్యాంక్ బండ్‌గా ఏర్పాటుచేస్తామని హామీలు ఇచ్చి నిధులు సైతం మంజూరు చేశారు. ఆన్‌లైన్ టెండర్లు కావడంతో కాంట్రాక్టర్ లెస్ టెండర్ ఎక్కువగా వేయడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాధన్నపేట చెరువును పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని కోరుతున్నారు.

బోటింగ్ కలేనా..

నర్సంపేట డివిజన్‌లో అతిపెద్ద చెరువు పాకాల.. తర్వాత మాధన్నపేట చెరువుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కానీ మాధన్నపేట చెరువు పర్యాటకంగా అభివృద్ధి పూర్తి స్థాయిలో కాకపోవడంతో పర్యాటకులకు నిరాశే మిగిలింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాత్రం బోటింగ్ సౌకర్యాన్ని రెండు దఫాలు నడిపించారు. చివరకు బోటింగ్ ఎత్తివేశారు. మాధన్నపేట చెరువుకు రెండు వైపులా రోడ్లు సౌకర్యం ఉందని, మినీ ట్యాంక్‌బండ్‌ను ఏర్పాటుచేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



మాధన్నపేట చెరువును మినీట్యాంక్ బండ్‌గా ఏర్పాటు చేస్తే పర్యాటకుల సందడి పెరుగుతోంది. స్థానికంగా ఉన్న వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందితే సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

– జుర్రు రాజుయాదవ్, మాజీ కౌన్సిలర్

పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గవిచర్లకు చెందిన రజక, ముదిరాజ్ సంఘం నాయకులతో పాటు 70 మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త, పాత అనే తేడా లేకుండా సమన్వయంతో వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, నాయకులు నాగరాజు, అంజన్‌రావు, యాకూబ్, స దయ్య, రమేష్, సతీస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధిచెప్పాలి


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రంగాపూర్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత హామీలను ప్రజలు నమ్మకుండా భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. అనంతరం రంగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఒరుగంటి రాజు ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. వారికి రాణాప్రతాప్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్, ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, గుర్రపు నరేష్, బత్తిని కుమారస్వామి, సింగిరెడ్డి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు


బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

రాయపర్తి : మండల కేంద్రంలోని మాల కాలనీ చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ తెలిపారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గాదె రవీందర్‌రెడ్డి, గారె నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, గ్రామపార్టీ అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని కాపాడి.. ప్రకృతిని రక్షిద్దాం..


నల్లబెల్లి: మట్టి వినాయకులతో విద్యార్థినులు


నర్సంపేట రూరల్: బాలాజీ టెక్నో స్కూల్‌లో..

నల్లబెల్లి : దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూనే.. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని నల్లబెల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓ ఆవుల సునీత అన్నారు. సోమవారం కేజీబీవీలో ఎస్ఓ సునీత, ఎకో క్లబ్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయురాలు జమునారాణి పర్యవేక్షణలో విద్యార్థినులు పర్యావరణ హిత మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు.

బాలాజీ టెక్నో స్కూల్‌లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూల్‌లో మట్టి విగ్రహాలను పూజించాలని విద్యార్థులతో 400 మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. లను పూజించాలని కోరారు. దీంతో పర్యావరణాన్ని ఎలాంటి హాని ఉండదన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఆకర్షణీయంగా తయారుచేసి విగ్రహాలకు ప్రత్యేక బహుమతులను అందించారు. రియాజుద్దిన్, ప్రదీప్, క్రాంతి కుమార్, భవానిచంద్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం..

నర్సంపేట : పర్యావరణ రక్షణకు మట్టి గణపతినే పూజిద్దామని వనప్రేమి, పర్యావరణ వేత్త గోకా రామస్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్వతిదేవి మట్టి గణపతిని చేసి ప్రాణ ప్రతిష్ఠ చేసిన ఒక మహా పండుగ వినాయక చవితి అని, మనం కూడా మట్టి గణపతులను పూజిద్దాం అని తెలిపారు.

గణపతి నవరాత్రులకు జాగ్రత్తలు తప్పనిసరి

సంగెం : రేపటినుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై నరేష్ సూచిస్తున్నారు. గణేష్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఈ ప్రక్రియ చేపట్టనున్నారు.

కమీషన్ డబ్బులు విడుదల చేయాలి


తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్లు

రాయపర్తి : తమ ఐదు నెలల కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎనగందుల ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం పిలుపుమేరకు స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్‌డీలర్లకు గౌరవ వేతనంగా రూ.5వేలు చెల్లిస్తామని అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కమీషన్ డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో వచ్చేనెల సెప్టెంబర్ 5న ఒక్కరోజు తెలంగాణ రేషన్ డీలర్ల పిలుపుమేరకు బంద్ పాటించనున్నట్లు తెలిపారు. ప్రధానకార్యదర్శి తాటికాయల భాస్కర్, ఉపాధ్యక్షుడు నాగపురి యశోదసోమయ్య, సహాయ కార్యదర్శి గాజుల శ్రీనివాస్, గుగులోతు లింగ్యానాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



పర్వతగిరి : ఉద్యోగ బాధ్యతలో పదవీ విరమణ సహజమని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంకపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుంపేటి విశ్వనాథం అభినందన సభ సోమవారం నిర్వహించారు. విశ్వనాథంను శాలువాతో సన్మానించి మెమోంటో అందజేశారు. సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా చేపట్టే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

'లంబాడీలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష'


మాట్లాడుతున్న గుగులోత్ తేజనాయక్

వర్ధన్నపేట : రాష్ట్రంలో 35 లక్షల జనాభా ఉన్న లంబాడీలకు కేబినెట్‌లో ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపుతోందని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా నాయకుడు గుగుతోత్ తేజ నాయక్ ఆరోపించారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తేజ నాయక్ మాట్లాడారు. లంబాడీల ఓట్లతో గెలిచిన రేవంత్ రెడ్డి సర్కార్ ఎస్టీ రిజర్వేషన్‌లో లంబాడీలను తొలగించాలని చూడటం అవివేకమని మండిపడ్డారు. ఈ విషయంపై హైకోర్టులో కేసులు పెట్టించి లంబాడీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. లంబాడీలపై చూపుతున్న వివక్షను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జనహిత యాత్రను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ నాయకులు గుగులోత్ లక్పతి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్, పార్టీ కార్యవర్గ సభ్యులు నార్యా నాయక్, భూక్య యాకూబ్, గుగులోతు దేవేందర్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ వినోద్, జిల్లా మహిళా మోర్చా మాజీ కార్యదర్శి గుగులోత్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

'అరెస్టులతో గొంతు నొక్కలేరు'

వర్ధన్నపేట : అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతును నొక్కలేరని, ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలపై తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి, జడ సతీష్, కొండేటి సత్యం అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జనహిత పాదయాత్ర అడ్డుకుంటారనే బీజేపీ, ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కట్ర్యాల శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నాంపల్లి కుమార్ రాజా, ఏబీవీపీ నాయకులు బెల్లం కార్తీక్, అజయ్, తదితరులు ఉన్నారు.

కొండేటి శ్రీధర్ హౌస్ అరెస్టు

జనహిత పాదయాత్రను అడ్డుకుంటారని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ని హనుమకొండలోని ఆయన స్వగృహంలో సుబేదారి పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు.

అన్నదాతల ఉసురు తీస్తున్నారు


నెక్కొండ: ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో రైతులు, పార్టీ నాయకులు

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : ఓట్ల కోసం రైతులకు అనేక హామీలిచ్చి, అధికారంలోకి రాగానే రైతుల ఉసురుతీస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరత కారణంగా రైతులు పడుతున్న కష్టాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ది మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రతీచోట రైతులు యూరియా కోసం ఆందోళనలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సంగని సూరయ్య, కొణిజేటి భిక్షపతి, కొమ్ము రమేశ్, గంటుక సోమయ్య, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, హరికిషన్, రవి, ఈదునూరి యాకయ్య పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి: రైతుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై అరుణ్ పోలీసు సిబ్బందితో రాస్తారోకో వద్దకు చేరుకుని రైతులతో చర్చిస్తూ ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నిస్తుండగా.. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు రావాలని రహదారిపై బైఠాయించారు. తహసీల్దార్ కృషి, ఏఓ రజిత అక్కడకు చేరుకుని రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు పాలెపు రాజేశ్వర్‌రావు, కొత్తపల్లి కోటిలింగాచారి, నానబోయిన రాజారాం, ఇంగ్లే శివాజీ, మామిండ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి: రైతులకు యూరియా అందించలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్నదాతలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని గిర్నిబావిలో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై సోమవారం బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అరగంట పాటు సాగిన రాస్తారోకో ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి సర్దిచెప్పడంతో ముగించారు. పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కాట్ల భద్రయ్య, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, శంకేసి కమలాకర్, రంగారావు, ప్రశాంత్, తోటకూరి రాజు, పిండి కుమారస్వామి పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందాల్సిందే

● సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య


నాచినపల్లిలో సర్వే నిర్వహిస్తున్న రంగయ్య

దుగ్గొండి : రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ప్రభుత్వ పథకాలు అందాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అన్నారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి సర్వే చేపట్టారు. మండల కార్యదర్శి బోళ్ల సాంబయ్య, నాయకులు పుచ్చ కాయల నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పొన్నం రాజు, పుచ్చకాయల మహేందర్‌రెడ్డి, మాదాసి శ్రీను, శ్రీకాంత్, రమేష్, బత్తిని స్వామి, కొండబత్తుల నర్సింహారాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నెక్కొండ : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల,కళాశాల (బాలికల) ప్రిన్సిపాల్ శ్రీదేవి సూచించారు. మండల కేంద్రంలోని గురుకులంలో సోమవారం కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ నెల 24న మహబూబాబాద్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ కుంగ్ ఫూ స్టేట్ పోటీల్లో విద్యార్థులు అస్మిత, శ్రీలక్ష్మి, వెన్నెల, శిరీష, అంజలి పాల్గొని వివిధ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. కరాటే మాస్టర్ రాజు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి

సంగెం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటి పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్, గాంధీనగర్, కొత్తగూడెం, తీగరాజుపల్లి, షాపూర్, లోహిత, పెద్ద తండా, రామచంద్రాపురం గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీలు అమలును కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని ఎన్నికలకు వెళ్లడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.

టిప్పర్ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్పగాయాలు

సంగెం : కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. లోహిత క్రషర్ నుంచి కంకర లోడ్‌తో వరంగల్ వైపునకు వెళ్తున్న టిప్పర్ రామచంద్రాపురం–గవిచర్ల రోడ్డు కెనాల్ సమీపంలో ఆటోను తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బిహార్‌కు చెందిన డ్రైవర్ సాదుకుమార్ సింగ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. షాపూర్ గ్రామానికి వెళ్లే ఆర్టీసీ బస్సుతో పాటు పలు వాహనాలకు గంటపాటు ట్రాఫిక్‌లో చిక్కుకోగా అంతరాయం ఏర్పడింది. జేసీబీ సాయంతో పోలీసులు స్థానికులు టిప్పర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ ఆస్పత్రిలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ప్రసవం

వర్ధన్నపేట : వర్ధన్నపేట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ సోమవారం పట్టణ కేంద్రంలోని వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు.

నివాళి

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొటికె సారమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. 2006 నుంచి 2011 వరకు సారమ్మ ఎంపీటీసీగా పనిచేశారు. ఆమె మృతదేహాన్ని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, బాబు సందర్శించి నివాళులర్పించారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ

నర్సంపేట : నర్సంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.రామకృష్ణ పిలుపు మేరకు రాబిన్ హుడ్ అకాడమీ సభ్యులు విద్యార్థులకు అరటి పండ్లు, బిస్కెట్లు ప ంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు నితీష్‌మోహన్, ఇబ్రహీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు..

నర్సంపేట : చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ జానుమియాకు మంజూరైన రూ.14వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి సోమవారం బాధితుడికి అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాలు..

వర్ధన్నపేట : టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం జాతీయ యువజన అవార్డు గ్రహీత, వర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాలోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



నర్సంపేట : నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 సంవత్సరానికి సోమవారం 20మంది విద్యార్థులను ఎన్‌సీసీ కేడెట్లుగా ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి లక్షణాలు పెంపొందేలా ఎన్‌సీసీ కృషి చేస్తుందని తెలిపారు. 20ఖాళీలకు దాదాపు 80మంది విద్యార్థులు పోటీ పడ్డారని, వివిధ పరీక్ష అనంతరం వారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎన్నికైన విద్యార్థులకు శుభకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రాజీరు, రజిత, రాంబాబు, స్టాఫ్ సెక్రటరీ ఎంఎంకె రహీముద్దీన్, పీడీ రమేష్, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R): 9502950309 (వర్ధన్నపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O): 9963646944